నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంకట్ ప్లాజా, ఒర్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, పోచమ్మ బస్తీ, పంజగుట్ట ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాధ

సనత్‌నగర్: జెక్‌కాలనీ స్ట్రీట్‌నెంబర్-1లోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత ఈఎన్‌టీ శిబిరానికి విశేష స్పందన లభించింది. లంగ్‌కేర్ సెంటర్ ఎండీ డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో ఈఎన్‌టీ సర్జన్ రాధ హాజరై చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 100 మందికి పైగా శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారికి డాక్టర్ రాధ పలు సూచనలు, జాగ్రత్తలను వివరించారు.

కేలండర్ ఆవిష్కరణ



బీసీ సంక్షేమ సంఘం కేలండర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

సనత్‌నగర్: బీసీ సంక్షేమ సంఘం రూపొందించిన కేలెండర్‌ను రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయడానికి, కులగణన చేపట్టేందుకు ఉద్యమ పంథా ఎంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్క బీసీ నాయకుడిపై ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, మన్నె వెంకట్‌ముదిరాజ్, గుడి రామకృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులందరూ పదవీ విరమణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో పని చేసిన పర్మనెంట్ డాక్టర్లు ఉద్యోగ విరమణ చేయడంతో పూర్తిగా ఖాళీ అయింది. గతంలో 12 మంది డాక్టర్లతో పాటు రాత్రి పని చేసే వైద్యులు, వివిధ దీర్ఘాలిక రోగాలకు స్పెషలిస్టులు పని చేశారు. నియామకాలు లేకుండా ఏటా ఉద్యోగ విరమణ చేయడంతో ప్రస్తుతం ఒక్క పర్మనెంట్ డాక్టర్ కూడా లేదు. గతంలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్లు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. ఓయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో పర్మనెంట్ డాక్టర్‌ను నియమించాలని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



సనత్‌నగర్: వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి మూడు నెలల పాటు ప్రతిరోజూ మజ్జిగ ప్యాకెట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ విధులు నిర్వర్తించే ఒక్కొక్కరికి రెండు చొప్పున మజ్జిగ ప్యాకెట్లు అందజేయనున్నారు. నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ఆదివారం మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పరామర్శ



సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు, మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి దంపతులను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. శాయి సతీమణి వరలక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇటీవల ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మోడల్‌కాలనీలోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

రెండో విడతకు స్పందన కరువు

- ప్రజాపాలన-2కు 101 దరఖాస్తులు
- ఐదు కేంద్రాల్లో ఏర్పాట్లు వృథా
- సర్వేకు సహకరించని సికింద్రాబాద్ ప్రజలు



జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలు (ఫైల్)

సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన ఫేజ్-2కు సికింద్రాబాద్ ప్రజల నుంచి స్పందన కానరాలేదు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా కుల గణన కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి కనబరచలేదు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సుమారు 11,200 కుటుంబాల నుంచి అధికారులు ఆర్థిక, కుల, సామాజిక వివరాలు సేకరించడానికి ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతనెల 17 నుంచి 28 తేదీ వరకు సిబ్బందిని అంబాటులో ఉంచారు. అధికారులు ఏర్పాట్లు ఘనంగానే చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా మొత్తంగా 101 కుటుంబాల నుంచి మాత్రమే దరఖాస్తులు అందినట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించారు.

85 శాతం మాత్రమే

రెండు నెలల క్రితం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా కుల గణన కార్యక్రమం పూర్తి చేశారు. ఎన్యుమరేటర్లను నియమించి మరీ సర్వే చేయించారు. ఇందులో 85 శాతం కుటుంబాలకు చెందిన వారి వివరాలు మాత్రమే రాబట్టగలిగారు.

- నియోజకవర్గంలో 79, 550 కుటుంబాలు ఉండగా 68,426 కుటుంబాలకు చెందిన వివరాలు మాత్రమే అధికారుల సర్వేలో లభించాయి. దరఖాస్తు దారులు నిర్దేశిత చిరునామాల్లో లేకపోవడం, డోర్‌లాక్, ఇంకొందరు వివరాలు అందించేందుకు సహకరించకపోవడంతో మిగతా 15 శాతం కుటుంబాల వివరాలు అధికారులకు అందలేదు.
- వివరాల సేకరణ అనంతరం ప్రత్యేక కేంద్రాలు వందలాది మంది సిబ్బందిని ఏర్పాటుచేసి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో డేటా నమోదు చేశారు. రెండు వారాల పాటు పనిచేసిన సిబ్బంది 68,426 కుటుంబాల వివరాలను ఎంట్రీ చేశారు.

నామమాత్రపు దరఖాస్తులు

ప్రజాపాలన సేవా కేంద్రాలను విజయవంతం చేయడం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏకంగా తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ కేడా నియోజకవర్గంలో పాద యాత్రలు నిర్వహించారు. వార్డు కార్యాలయాల్లోని సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు అందించాలని పిలుపునిచ్చారు. అయినప్పటికీ ఐదు డివిజన్ల నుంచి 101 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇందులో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన 2 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచిన అధికారులు మిగతా 99 దరఖాస్తులను ఆమోదించారు.

సేవా కేంద్రాలకు అందిన దరఖాస్తులు

డివిజన్	సంఖ్య
అడ్డగుట్ట	11
తార్నాక	29
మెట్టుగూడ	10
సీతాఫల్‌మండి	46
బౌద్ధనగర్	05
మొత్తం	101
పెండింగ్‌లో	02
ఆమోదించినవి	99

బస్తీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు



తిరుమలగిరి ఇన్‌ఫ్రాంట్రీ జీసస్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: బస్తీల్లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. బస్తీ పర్యటన కార్యక్రమంలో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని తిరుమలగిరి ఇన్‌ఫ్రాంట్రీ జీసస్ కాలనీలో శ్రీగణేష్ పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు దశాబ్దాల క్రితం వేసిన తాగునీటి పైపులైను శిథిలావస్థకు చేరడంతో కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని వాంబే ఇళ్లపై స్లాబు పగుళ్లు, వీధీ దీపాలు లేక పోవడం వల్ల బస్తీలో అంధకారం నెలకొని ఉందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బోర్డు అధికారులతో ఫోన్‌ద్వారా మాట్లాడిన ఎమ్మెల్యే సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మేరీ మాన్యూల్, రాకేష్, చాముండేశ్వరి, పాల్గొన్నారు.

డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన శిబిరంలో యువకులు

సనత్‌నగర్: బ్రహ్మకుమారీస్ ఎస్సార్‌నగర్ శాఖ, ఆశా హాస్పటల్, మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 'యువత మానసిక ఆరోగ్యం పరిస్థితి'పై అవగాహన శిబిరం నిర్వహించారు. ఎస్సార్‌నగర్ చౌరస్తాలోని బాపునగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానసిక వైద్యులు హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఒత్తిడిని విధంగా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మాధవి, సురేష్, శ్రీనివాస్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై కక్షసాధింపు



మాట్లాడుతున్న సాయి తేజ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడాన్ని బీసీ విద్యార్థి సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదవరి సాయితేజ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. జనాభ దామాషా ప్రకారం బీసీలకు రావలసిన వాటా, హక్కుల గురించి ప్రశ్నించిన తీన్‌మార్ మల్లన్న పై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాలుగు స్థానాలను, మంత్రి వర్గ విస్తరణలో ఆరు మంత్రిపదవులకు బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి బీసీలు దూరమవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి నాయకులు గంగాపురం కర్ణాకర్ పాల్గొన్నారు.

అవార్డులు ప్రదానం

పద్మారావునగర్: సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని గుజరాతీ స్కూల్‌లో ఆదివారం లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ అధ్వర్యంలో పలు రంగాల్లో సేవలందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంస్థ చైర్మెన్ జస్మత్ పటేల్ ఆధ్వర్యంలో గోసేవ, సనాతన సేవ, ఆరోగ్య సేవ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు ఈ అవార్డులను అందజేశారు. ప్రముఖ సామాజిక కార్యకర్త కాజల్ హిందుస్తానీ చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేశారు. నరేంద్ర మోదీ విచార్ మంచ్ తెలంగాణ అధ్యక్షులు టి. మధుసూదన్ గౌడ్ మహాకుంభ మేళా త్రివేణి సంగం నుంచి తెచ్చిన పుణ్య జలాలను అందజేశారు. పరమేశ్వరిశర్మ, కుమార్ యాదవ్, అడ్వకేట్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులను అందజేస్తున్న నిర్వాహకులు

సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చాపెల్ చర్చి ప్రారంభం



చర్చి ప్రారంభ కార్యక్రమంలో ఆర్చ్ బిషప్ ఆంథోని

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ న్యూబోయిగూడ బొక్కలగూడలోని పునర్ నిర్మించిన సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చాపెల్ నూతన చర్చిని హైదరాబాద్ ఆర్చ్ బిషప్ పూల ఆంథోని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్చ్ బిషప్ పూల ఆంథోని మాట్లాడుతూ ప్రేమ స్వరూపమైన ప్రజలకు దైవ కుమారుడైన ఆ యేసు ప్రభువు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. చారిత్రాత్మకమైన ఈ ప్రార్థన మందిరాన్ని 1900 సంవత్సరంలో నిర్మించారని, ఆ తర్వాత 1993లో కొన్ని మరమ్మతులు చేశారన్నారు. కార్యక్రమంలో నామినేటెడ్ మాజీ సభ్యులు ఎల్విస్ స్టీఫెన్సన్, ఫాదర్ ప్రతాప్, ఫాదర్ నరేష్, తదతరులు పాల్గొన్నారు.

ఓయూ పాలక మండలిని నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలక మండలి సభ్యులను (ఈసీ) నియమించాలని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలంయాదవ్ డిమాండ్ చేశారు. పాలక మండలి సభ్యులు లేనందున ఓయూ అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గత ఏడాది నుంచి పాలక మండలి సభ్యులు లేకుండా నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పాలనలో మంత్రిని నియమించకుండ సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



సువార్త సభల్లో ప్రసంగిస్తున్న సామ్యూల్ కరణ్

లాలాపేట: బెత్లహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి 18 వార్షికోత్సవం సందర్భంగా రక్షణ సువార్త స్వస్థత మహా సభలు ఆదివారం శాంతినగర్‌లో ప్రారంభమయ్యాయి. సంఘ కాపరి రెవరెండ్ ఆచార్య ఆహరోన్ తీగుళ్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సువార్త స్వస్థత సభలకు గిఫ్ట్ గ్లోబల్ మినిస్ట్రీస్ నుంచి రెవరెండ్ డా. సామ్యూల్ కరణ్, డబ్ల్యూసిఎం కిరణ్ పాల్ తదితరులు ముఖ్య ప్రసంగికులుగా హాజరయ్యారు. లిజబెత్ అహరోన్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం

కంటోన్మెంట్: చింతల్ బస్తీ వాసులకు ఇచ్చిన హామీ మేరకే సొంత నిధులతో కమ్యూనిటీ హాలు (సీహెచ్) నిర్మాణం పూర్తి చేసేందుకు ముందుకు వచ్చినట్లు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఒకటో వార్డు చింతల్ బస్తీలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలు పునర్ నిర్మాణ పనులకు స్థానిక షెడ్యూల్డ్ క్యాస్ట్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్ద తోకట్టా, చింతల్ బస్తీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే రూ.45 లక్షలు, మాజీ ఎంపీ మల్లారెడ్డి రూ.15 లక్షలు తమ నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించినట్లు తెలిపారు. అయితే మరో రూ.10 లక్షల మేరకు వెచ్చిస్తే కానీ నిర్మాణం పూర్తి కాని పరిస్థితిలో ఉందన్నారు. స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో పూర్తి చేయిస్తానని వారికి హామీ ఇచ్చానన్నారు.

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: ప్రపంచ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ముదిగంటి శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం.డి ముజాహిద్ శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చాలా కాలం నుంచి మానవ హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తూ అనేక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మానవ హక్కుల గురించి ప్రజలను చైతన్యవంతులను చేస్తానన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 21, క్యాప్సికమ్ 32, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 45, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 21, చామగడ్డ 45.

నగర ట్రాఫిక్-1 అడిషనల్ డీసీపీగా వేణుగోపాల్‌రెడ్డి



వేణుగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సనత్‌నగర్: నగర ట్రాఫిక్-1 అడిషనల్ డీసీపీగా వేణుగోపాల్‌రెడ్డి నియమితుయ్యారు. 1991 సంవత్సరంలో ఎస్‌ఐ (సివిల్)గా విధుల్లో చేరిన ఆయన నగరంలో పలుచోట్ల పని చేశారు. ఆదివారం ఆయన నగర కమిషనర్ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా బేగంపేటలోని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌రెడ్డిని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మినీ బస్సును ఢీకొన్న మినీ లారీ..

- లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



దెబ్బతిన్న లారీ

అమీర్‌పేట: వేగంగా దూసుకువచ్చిన మినీ లారీ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సును ఢీకొట్టడంతో బస్సు బోల్తా కొట్టింది. లారీ ముందు భాగం ధ్వంసం కాగా డ్రైవర్ కాళ్లు విరిగాయి. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. బీదర్ నుండి మినీ లారీ తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఎర్రగడ్డ నుండి అమీర్‌పేట వైపు వెళుతోంది. ఎస్ఆర్‌నగర్ ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీ సమీపంలో ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సు యూటర్న్ తీసుకుంటుండగా వేగంగా దూసుకు వచ్చిన లారీ ఢీకొట్టడంతో బస్సు బోల్తా పడింది.ఈ సంఘటనలో లారీ ముందుగా భాగం నుజ్జు నుజ్జయ్యింది.లారీ డ్రైయివర్ ఫరీద్ షా (24) రెండు కాళ్లు విరిగి పోవడంతో పాటు ఒంటికి తీవ్ర గాయాలు అయ్యాయి. బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఎల్‌ఓసీ పత్రాల అందజేత..

బంజారాహిల్స్: కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఖైరతాబాద్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన రమేష్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే దానం నాగేందర్ అందజేశారు. అలాగే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి రావడంతో ఎమ్మెల్యే నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ బీరప్పతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా తనకు సీఎంఆర్ఎఫ్ వచ్చేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యేకు రమేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మా పొట్ట కొట్టకండి.. ప్లీజ్..!

- ఫ్రూట్‌మార్కెట్ వ్యాపారుల ఆందోళన



తోపుడు బండ్లను లాకెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు

అడ్డగుట్ట: సంవత్సరాల తరబడి జీవనోపాధిగా ఉన్న తమ వ్యాపారాలను తొలగించి పొట్టకొట్టొద్దని లాలాగూడ ఫ్రూట్ మార్కెట్ స్ట్రీట్ వెండర్లు వాపోయారు. ఆదివారం చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు న్యూ బ్రిడ్జ్ నుంచి మిర్జాలగూడ వరకు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగిస్తున్న వెండర్ల బండ్లను తొలగించారు. ఈ క్రమంలో చిరు వ్యాపారులందరూ ఆందోళనకు దిగారు. గత 20 సంవత్సరాలుగా లాలాగూడలోని న్యూ బ్రిడ్జ్ నుంచి మిర్జాలగూడ వరకు చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న తమను ఈ మధ్య ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ప్రాంతాన్ని గ్రీన్ జోన్‌గా జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ధారించినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం అవి పట్టించుకోకుండా తమపై అజమాయిషీ చెలాయిస్తూ తమ బండ్లను అక్రమం తొలగించడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నిస్తున్నారు. కొన్నేళ్లుగా సుమారు 50 మంది చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని కానీ, తమ పొట్టకొట్టే విధంగా ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతోందంటూ ట్రాఫిక్ పోలీసులు అవలంబిస్తున్న చర్యలు సరైనవి కావన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తమకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘు బాబు ఘటనా స్థలానికి చేరుకొని వ్యాపారులతో మాట్లాడటంతో ఆందోళన విరమించారు.



రోడ్డుపై పడేసిన పండ్లను చూపిస్తున్న వెండర్లు

పండ్లన్నీ నేలపాలు

రంజాన్ మాసం సందర్భంగా పండ్ల విక్రయాలు అధికంగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో డబ్బులు ఖర్చు చేసి పెద్ద మొత్తంలో పండ్లు తీసుకువచ్చామని, కాని ట్రాఫిక్ పోలీసులు ఆ పండ్లన్నీ నేలపాలు చేశారని వెండర్లు వాపోతున్నారు. అంతే కాకుండా తమ తోపుడు బండ్లను కూడా డీసీఎంలలో తరలించారని పేర్కొన్నారు.



ఫ్రూట్ వెండర్లతో మాట్లాడుతున్న లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు

జీవనోపాధి కోల్పోతున్నాము



పదేళ్లుగా ఇక్కడి పండ్లు విక్రయిస్తున్నాము. మూడు నెలలుగా ట్రాఫిక్ పోలీసులు నిత్యం వచ్చి బండ్లను తొలగించాలని చెబుతున్నారు. వీటిని తొలగిస్తే మా జీవనోపాధిని కోల్పోతామని, తమ కుటుంబాలు రోడ్డు పాలు అవుతాయని ఎంత చెప్పినా కూడా వినిపించుకోవడం లేదు. తమ కష్టాలు ఇంకెవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– శ్రీనివాస్, పండ్ల వ్యాపారి